



అవధాని బి.ఎ ప్యాసయిన తర్వాత బి.ఇడి. కూడా అయిందనిపించుకున్నాడు. అటుతర్వాత బడిపంతులు ఉద్యోగంకోసం దరకాస్తులు పెట్టి ఉంచాడు. ఈ రోజుల్లో ఉద్యోగాలంత తేలికగా దొరుకుతాయా? అందుకని ఎవరో చెప్పారని ఓ మంచిరోజు చూసి ఇంటిముందు బోర్డు కట్టేశాడు. దాని సారాంశమిది.

అవధానీ ట్యుటోరియల్ ఇంగ్రేజీ ఇచ్చట హెచ్.ఎస్.సి. ఎస్ ఎస్.సి; మెట్రిక్ (జూ అండ్ సీ) మొదలుకొని ఆరవతరగతి వరకు ప్రయివేట్లు చెప్పబడును.

ఆ బోర్డు కట్టిన మూడోరోజుకి ఓ పెద్ద మనిషికి ఓ కుర్చీ చూపించి అతడు కూర్చున్న తరువాత ఆయనరాకకి కారణం అడిగేడు ఆ వచ్చిన పెద్ద మనిషి తాను వచ్చిన పని బయట పెట్టాడు. వాళ్లబ్బాయి ఏదో తరగతి రెండుసార్లు తప్పాడట. ఏ మాష్టరు దగ్గర ప్రయివేటు చెప్పించినా లాభం వుండటం లేదట. అందుకని ఇక్కడకు వచ్చానని చెప్పాడు

ఇది మొదటి కేసు గనుక పోనివ్వగూడదని అవధాని ఆ కుర్రవాణ్ణి పరీక్ష ప్యాసు చేయించే బరువు బాధ్యతల్ని విశాలమైన తన భుజస్కంధాలమీద వేసుకున్నాడు. ఫీజుకూడా అందరికంటె అయిదు రూపాయిలు తక్కువ. ఇహనేం అన్నీ చక్కగా కుదిరిపోయాయి. ఆ మర్నాడే ఆ కుర్రాడు ప్రయివేటు కొచ్చాడు. అప్పుడుగాని తెలియలా ఆ కుర్రాడికి రెండో ఎక్కం కూడా రాదనీ, వొట్టి మొద్దనీ; వందసార్లు చెప్పిన ఒక్కసారైనా కరెక్టుగా లెక్క

చెయ్యలేక పోయే సరికి 'అబ్బా! ఇదె క్కడి కర్మరా బాబూ' అంటూ తల పట్టుక్కూచున్నాడు అవధాని తెలుగు, ఇంగ్లీషు డిక్టేషను అన్నీ తప్పులే. కాని ఏంచెయ్యగలడు వాణ్ణి? పైగా వాణ్ణి పరీక్ష చేయించే బాధ్యత తన విశాల భుజస్కంధాలమీద వేసుకున్నాడాయె!

చైనాలో సాంస్కృతిక విప్లవం ప్రవేశ పెట్టినట్టుగా ఆ కుర్రాడిలో విద్యా విప్లవాన్ని తీసికురావాలని అవధాని నిశ్చయించుకున్నాడు. పునాదులు గట్టిగా వుంటేనే ఏ కట్టడమైనా నిలుస్తుందని ఆ ఏడో తరగతి కుర్రాడికి ఎక్కాల పుస్తకం వొకటి, ఒకటో తరగతి తెలుగు వాచకం, ఎలిమెంటరీ ఇంగ్లీషు పుస్తకం రాసిచ్చి అవి కొనుక్కోని ఆ మర్నాడు పట్రమ్మన్నాడు. ఆ కుర్రాడు బుత్తాడించి ఆ మర్నాడు వాడి తండ్రిని వెంటేసుకొచ్చాడు. ఏమిటి 'మేష్టారూ?' మావాడికి ఒకటో తరగతి పుస్తకాలు రాసిచ్చారు?

మరేనండి. మీ వాడికి అసలు ఏమీ రాదు. అందుకని పునాదులు...అదే స్టాండర్డు, గట్టిగాఉంటుందని ఒకటో తరగతినుంచి మొదలుపెడుతున్నాను.

'అయితే ఒకటో తరగతి తర్వాత రెండో తరగతి, ఆ తర్వాత మూడో తరగతి పుస్తకాలు కొనాల్సిందేనా?'

'ఆహాఁ'

'అయితే మీకూ, మీ ప్రయివేటుకీ ఓ నమస్కారం! 'వెళ్తున్నాం' అంటూ వాళ్లబ్బాయిని వెంటబెట్టుకుని వెళ్లిపో యాడా పెద్దమనిషి. అవధాని అలా చూస్తూ వుండిపోయాడు. ఆ విధంగా శిష్యుడూ, నెంబర్ వన్ అండ్ లాస్ట్ ఆ రెండో రోజునే జారుకున్నాడు. అటు తర్వాత అవధాని దగ్గరకు ప్రయివేట్లు చెప్పించుకోడానికెవ్వరూ రాలేదు.

నెలరోజులు గడిచిన తర్వాత ఓ మిట్టమధ్యాహ్నంవేళ మున్సిపల్ టాక్సు కలెక్టర్ వచ్చాడు. 'అవధాన్లు గారు మీరేకదూ!' అన్నాడు.

'అవునండి. నేనే! ఏం కావాలి మీకు?'

'బైట గోడకు కట్టిన బోర్డు మీదే కదూ!?'

'ఆఁ, అవును.'

'అయితే మీరు టాక్సు కట్టాలి?

'టాక్సా! ఎందుకు?'

'ఎందుకేమిటండీ! అలా బోర్డు కట్టి నందుకు,' అంటూ బిల్లుపుస్తకాలు తీశాడు టి. సి.

'ఇంటే?' - అన్నాడు అర్థంగాక అవధాని.

'ఎడ్వర్ టైజ్ మెంట్ టాక్సు అండీ!' అన్నాడు, టి.సి. రశీదుచింపుతూ

అవధాని నోరు వెళ్లబెట్టాడు.

పోకెట్ మనీగా ఉంచుకున్న డబ్బుని టి సి. చేతుల్లో పెట్టి టి సి. అందించిన రశీదు పుచ్చుకున్నాడు అవధాని. అతని కాసమయంలో ఏడ్పు వచ్చేలా ఉంది. అయినా తమాయించు కున్నాడు.

టి.సి. అతన్ని అదోరకంగా చూసు కుంటూ వెళ్లిపోయాడు. అతనటు వెళ్లి పోగానే 'ఇచ్చట ప్రయివేట్లు చెప్ప బడును' అన్న బోర్డు పీకి అటకమీదకు విసిరి పారేశాడు అవధాని.

---